

# ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగడం మంచిదేనా..

కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి చాలా మంచివని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఒక గ్లాసు కొబ్బరి నీళ్లు తాగితే శరీరానికి అనేక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. అంతేకాకుండా, కొబ్బరి నీళ్లు సహజమైన పానీయం కావడంతో శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్స్, పొటాషియం, సహజ చక్కెరలు అందుతాయి. అయితే, చాలా మంది ఉదయం ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగుతారు. ఇలా ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగడం ఆరోగ్యానికి మంచిదేనా? ఈ విషయంపై నిపుణులు ఏం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం..

**జీవక్రియ మెరుగుపడుతుంది**

ఉదయం ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగితే ఆరోగ్యానికి మరిన్ని ప్రయోజనాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. శరీరంలోని జీర్ణవ్యవస్థ వేగంగా పనిచేయడం ప్రారంభిస్తుందని, ఇది శరీరంలోని ఎంజైమ్‌లను యాక్టివ్ చేసి జీర్ణక్రియను మెరుగుపరుస్తుందని చెబుతున్నారు.

**గుండె ఆరోగ్యం**

కొబ్బరి నీటిలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో, ఒత్తిడిని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. హై బీపీ ఉన్నవారు ప్రతిరోజు కొబ్బరి నీళ్లు తాగడం మంచిదని చెబుతున్నారు.

**శక్తిని పెంచుతుంది**

కొబ్బరి నీటిలో ఉండే సహజ చక్కెరలు, ఎలక్ట్రోలైట్లు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ఇది జిమ్ చేసిన తర్వాత లేదా తీవ్రమైన పని చేసిన తర్వాత తాగడం మరింత మంచిదని సూచిస్తున్నారు.

**చర్మం మెరిసిపోతుంది**

తక్కువ ఖర్చుతో చర్మానికి సహజ మెరుపు కావాలా? అయితే ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగితే ప్రయోజనం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు, సైటోకిన్లు చర్మ కణాలను మరమ్మత్తు చేసి, వృద్ధాప్య లక్షణాలను తగ్గించడంలో సహాయపడతాయని అంటున్నారు.

**ఎలక్ట్రోలైట్ సమతుల్యతకు సహాయం**

రాత్రిపూట మన శరీరం ఎన్నో ఎలక్ట్రోలైట్స్‌ను కోల్పోతుంది. ఉదయం కొబ్బరి నీరు తాగడం ద్వారా పొటాషియం, సోడియం వంటి మూలకాలు తిరిగి అందుతాయి. ఇది డీహైడ్రేషన్ నివారణకు మంచి పరిష్కారం.

రోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగడం ద్వారా మీ శరీరం, చర్మం, జీర్ణవ్యవస్థకు ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, కొబ్బరి నీరు ఎక్కువగా తీసుకోవడం వల్ల కొన్ని వయస్సు గలవారికి లేదా కిడ్నీ సమస్యలున్నవారికి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కాబట్టి, మీరు ప్రతి రోజూ కొబ్బరినీళ్లు తాగుతుంటే డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది.





# వానాకాలం సమస్యలకు వేపతో చెక్

భారతీయ సంప్రదాయక వైద్య విధానాల్లో వేపకు ఉన్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. ముఖ్యంగా వానాకాలంలో వచ్చే చర్మ సంబంధిత సమస్యలకు వేపకు మించిన పరిష్కారం లేదని అనుభవజ్ఞులు చెబుతారు. వేప నూనె, ఆకులు, పసరు ఇలా ఎన్నో రకాలుగా వేపను వినియోగించొచ్చు. వేపలో నింబిడిన్, అజాడిరెక్టిన్, ఫ్లేవనాయిడ్స్ వంటి బయోయాక్టివ్ రసాయనాలు ఉన్నాయి. వీటి కారణంగా ఫంగల్, బ్యాక్టీరియల్ వ్యాధులతోపాటు ఇన్‌ఫ్లమేషన్ నుంచి కూడా రక్షణ లభిస్తుంది. వైద్యులు చెప్పే దాని ప్రకారం, వానాకాలంలో గాల్లో తేమ ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా చర్మ సంబంధిత సమస్యలు మొదలవుతాయి. వీటికి వేప చక్కని పరిష్కారం. వానాకాలంలో ఆక్నే సహజం. తేమ ఎక్కువగా ఉన్నప్పుడు శ్వేదం ఎక్కువగా ఉత్పత్తి అయ్యి చర్మ రంధ్రాలు మలినాలతో పూడుకుపోతాయి. ఇది చివరకు బ్లాక్ హెడ్స్, పింపుల్స్ వంటి సమస్యలకు దారి తీస్తాయి. కానీ వేపలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాల కారణంగా బ్యాక్టీరియా ఇబ్బంది తొలగి చర్మానికి సాంత్వన లభిస్తుంది. చర్మంపై తెల్లని పొట్టు రేగడాన్ని ఎగ్జిమా అంటారు. ఈ సమస్య ఉన్న వారిని దురద కూడా వేధిస్తుంది. వానా కాలంలో ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది. వేపలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఎగ్జిమా నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఫైటోకాంపౌండ్స్, ఫ్లేవనాయిడ్స్, అజాడిరాడియోన్ కాంపౌండ్స్ ఎగ్జిమా తీవ్రం కాకుండా నిరోధిస్తాయి. ఇక సోరియాసిస్ ఉన్న వారిలో చర్మంపై పొలుసులతో కూడిన ఎర్రటి ప్యాచెస్ ఏర్పడతాయి. దురద కూడా పెరుగుతుంది. వానాకాలంలో గాల్లోని తేమ కారణంగా సమస్య మరింత తీవ్రమవుతుంది. అయితే వేప పసరు చర్మానికి రాసుకుంటే సోరియాసిస్ నుంచి తక్షణ ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇక వేప నూనెలో గాయాలను త్వరగా మానేలా చేసే గుణం కూడా ఉంది. వానాకాలంలో అథ్లెట్స్ ఫుట్, రింగ్ వార్మ్, కాండిడియాసిస్ వంటి ఫంగల్ ఇన్ఫెక్షన్లు కూడా ఎక్కువవుతాయి. అయితే, వేపలోని యాంటీఫంగల్, యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఈ సమస్యలకు సులువుగా చెక్ పెడతాయి. ఫంగస్ పెరుగుదలను అడ్డుకుని వ్యాధులను నిరోధిస్తాయి. కాబట్టి ఈ కాలంలో వచ్చే అనేక సమస్యలకు వేప మంచి పరిష్కారమని నిపుణులు చెబుతున్నారు.

# లివర్ క్యాన్సర్ ముప్పు తగ్గాలంటే..

ప్రపంచవ్యాప్తంగా ఆందోళన రేకెత్తిస్తున్న అనారోగ్యాల్లో లివర్ క్యాన్సర్ ఒకటి. జీవనశైలి మార్పులు, పర్యావరణ అంశాలు ప్రధానంగా లివర్ క్యాన్సర్‌కు కారణమవుతున్నాయి. అయితే, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఈ ముప్పును చాలా వరకూ తగ్గించుకోవచ్చని గ్యాస్ట్రో ఎంటిరాలజిస్టులు చెబుతున్నారు. ముఖ్యంగా లివర్ ఆరోగ్యాన్ని కాపాడుకోదలిచిన వారు ఎన్నడూ చేయకూడని తప్పులు కొన్ని ఉన్నాయని అంటున్నారు. మరి అవేంటో ఈ కథనంలో సవివరంగా తెలుసుకుందాం.




ప్రాసెస్డ్ మాంసాహారం జోలికి అస్సలు వెళ్లకూడదనేది వైద్యులు చేసే ప్రధాన సూచన. హాట్ డాగ్స్, బేకన్స్, సాసేజస్ వంటి ప్రాసెస్డ్ ఆహారాల్లోని నైట్రేట్స్ అనే రసాయనాలు, ఇతర ప్రిజర్వేటివ్‌లు క్రమక్రమంగా లివర్ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. క్యాన్సర్ ముప్పును పెంచుతాయి.

మద్యం ఓ మోస్తరుగా సేవించినా కూడా లివర్‌పై తీవ్ర ప్రభావం పడుతుంది. సిర్రోసిస్ వంటి వ్యాధుల రిస్క్ అమితంగా పెరుగుతుంది. అదీ ఇదీ అనే తేడాలు లేకుండా ఆల్కహాల్ ఏదైనా ప్రమాదమేనని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రెడ్ వైన్‌తో హాని లేదనే తప్పుడు భావనలను వదిలిపెట్టాలని కూడా చెబుతున్నారు. మద్యపానానికి దూరంగా ఉంటేనే లివర్ ఆరోగ్యాన్ని పది కాలాల పాటు కాపాడుకోవచ్చని చెబుతున్నారు.

చక్కెరలు అధికంగా ఉన్న పానీయాలు కూడా లివర్‌కు చేటు చేస్తాయి. అధిక చక్కెరలతో లివర్‌పై బర్డెన్ పెరుగుతుంది. చివరకు ఇది ఫ్యాటీ లివర్ వ్యాధికి దారి తీస్తుంది. ఫ్యాటీ లివర్ ఉన్న వారికి క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. ఫ్రెంచ్ ఫ్రైస్, ఫ్రైడ్ చికెన్ వంటి బాగా వేయించిన ఆహారాలకు కూడా దూరంగా ఉండాలి. ఈ ఫుడ్స్ లివర్‌లో దీర్ఘకాలిక ఇన్‌ఫ్లమేషన్‌కు దారి తీస్తాయి. కాలం గడిచే కొద్దీ ఇది క్యాన్సర్ ముప్పును పెంచుతుంది. కాబట్టి, ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని జీవనశైలి ఆహారపు అలవాట్లలో తగిన మార్పులు చేసుకుంటే లివర్ క్యాన్సర్ ముప్పును చాలా వరకూ తగ్గించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.

# అపాన వాయువుకు వేగంగా చెక్ పెట్టే పరిష్కారాలు

జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉందనేందుకు అపాన వాయువు ఓ ముఖ్య సంకేతమని వైద్యులు చెబుతారు. అయితే, కొన్ని సందర్భాల్లో ఇది ఇబ్బందికర పరిస్థితులకు దారి తీయొచ్చు. ఇక ఈ సమస్యతో నిత్యం ఇబ్బంది పడే వారి ముందు కొన్ని చక్కని పరిష్కార మార్గాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. వీటితో తక్షణ పరిష్కారం లభిస్తుందని భరోసా ఇస్తున్నారు.



వైద్యులు చెప్పేదాని ప్రకారం, సిమెథికోన్ ఔషధంతో ఈ సమస్యకు వెంటనే పరిష్కారం లభిస్తుంది. దీన్ని మెడికల్ షాపుల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండానే కొనుగోలు చేయొచ్చు. ఇది కడుపులోని అపానవాయువు బబుల్స్‌పై సర్ఫేస్ టెన్షన్‌ను తగ్గిస్తుంది. దీంతో, ఈ గ్యాస్ బుడగలు కలిసిపోయి సులువుగా బయటకుపోతాయి. విమానప్రయాణాలు చేసే వారు వీటిని తప్పక వెంట తీసుకెళ్లాలని నిపుణులు చెబుతున్నారు. కడుపుబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుందని అంటున్నారు.

పుదీనా టీతో కూడా అపాన వాయువు బెడదకు తక్షణ ఉపశమనం లభిస్తుంది. పుదీనాలోని మెంథాల్ పేగుల కండరాలు వదులుగా అయ్యేలా చేస్తుంది. దీంతో, కడుపు ఉబ్బరం తగ్గి గ్యాస్ త్వరగా బయటకు పోతుంది. కడుపులోని ఇబ్బందులు కూడా పుదీనాతో తొలగిపోతాయి.

పెప్టోబిస్మాల్ మరో అద్భుత ప్రత్యామ్నాయమని నిపుణులు చెబుతున్నారు. ఇది పేగుల్లోని దుర్గంధకారక సల్ఫర్‌ను పట్టి బంధిస్తుంది. దీంతో, అపాన వాయువులోని దుర్వాసన తగ్గుతుంది. ఈ ఔషధంలో బిస్మత్ సబ్‌శాలిసిలేట్ అనే కాంపౌండ్ ఉంటుంది. ఇది పేగుల్లోని సల్ఫర్ ఆధారిత పధార్థాలను పట్టి బంధించి అపానవాయువు దుర్వాసన తగ్గేలా చేస్తుంది. ఇది లిక్విడ్, టాబ్లెట్‌ల రూపంలో లభిస్తుంది.

వీటితో పాటు కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లతో అపాన వాయువు బెడద నుంచి తప్పించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆహారాన్ని బాగా నమిలి తినాలి. గ్యాస్‌కు కారణమయ్యే కొన్ని రకాల కార్బోహైడ్రేట్స్, కాంప్లెక్స్ చక్కెర పదార్థాలు, పీచు పదార్థాలను తినకూడదు. చ్యూయింగ్ గమ్ అలవాటుంటే మానుకోవాలి. సోడా, బీర్ లాంటి కార్బొనేటెడ్ డ్రింక్స్ జోలికి వెళ్లొద్దు. ధూమపానం అలవాటునూ వదిలిపెట్టాలి. అన్ని జాగ్రత్తలు తీసుకున్నా అపాన వాయువు బెడద వేధిస్తోందంటే వైద్యులను తప్పనిసరిగా సంప్రదించాలి.



# ప్రతిరోజూ ఓట్స్ తింటున్నారా..

## ఈ ముఖ్య విషయాలు తెలుసుకోండి..

ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ ఓట్స్‌ను తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఓట్స్‌లో ఫైబర్, ప్రోటీన్, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. అలాగే ఇవి చాలా రుచిగా కూడా ఉంటాయి. పండ్లు, గింజలు, విత్తనాలతో కలిపి రోజూ ఓట్స్ తినడం వల్ల మరింత ఆరోగ్యంగా ఉంటారు. ఇది బరువు తగ్గాలనుకునే వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రతిరోజూ ఓట్స్ తింటే శరీరానికి అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. వాటిని తినడం వల్ల శరీరానికి ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో ఇప్పుడు తెలుసుకుందాం..

**జీర్ణక్రియ మెరుగుపడుతుంది**

ఓట్స్‌లో కరిగే ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది కడుపును తేలికగా ఉంచి, మలబద్ధకాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే, ఓట్స్ నీటిని పీల్చుకొని జెల్‌లా మారి, మలాన్ని సాఫీగా బయటకు పంపడానికి తోడ్పడతాయి. దీంతో గ్యాస్, ఉబ్బరత వంటి సమస్యలు తక్కువగా ఉంటాయి.

**కడుపు నిండిన అనుభూతి**

ఓట్స్‌ను ఉదయం అల్పాహారంగా తీసుకుంటే మధ్యాహ్నం వరకు ఆకలి వేయకుండా ఉంటుంది. ఇది నెమ్మదిగా జీర్ణమవ్వడం వల్ల, ఎక్కువసేపు శక్తిని అందిస్తూ కడుపు నిండిన భావన కలుగుతుంది. దీని వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది.

**కొవ్వు తగ్గించడంలో సహాయపడుతుంది**

బొడ్డు భాగంలో ఉన్న కొవ్వును కరిగించడం చాలా కష్టం. అయితే ఓట్స్‌లో ఉండే బీటా-గ్లూకాన్ అనే ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంతో పాటు ఆకలిగా లేకుండా చేస్తుంది. ఈ విధంగా, అనవసరమైన తినే అలవాట్లు తగ్గి కొవ్వు నిల్వ తగ్గుతుంది.

**చర్మం మెరిసిపోతుంది**

ఓట్స్ తినడం వల్ల పేగుల ఆరోగ్యం మెరుగవుతుంది. ఇది శరీరంలోని టాక్సిన్లను బయటకు పంపించి, చర్మాన్ని సహజంగా మెరిపిస్తుంది. పొడిబారిన చర్మం, ఎరుపు దద్దుర్లు వంటి సమస్యలకూ ఓట్స్ ఉపశమనం కలిగిస్తాయి. అందుకే చాలా బ్యూటీ ఉత్పత్తుల్లో కూడా ఓట్స్ ఉపయోగిస్తారు.

**శక్తి స్థాయిలు సమతుల్యంగా ఉంటాయి**

ఓట్స్ తిన్న తర్వాత శరీరంలో శక్తి ఒక్కసారిగా రాకుండా నెమ్మదిగా విడుదల అవుతుంది. ఈ ఫలితంగా, రోజంతా శరీరానికి శక్తి అందుతుంది. ఒత్తిడిని తగ్గించడంలోనూ, పని చేసే సామర్థ్యాన్ని మెరుగుపరచడంలోనూ ఓట్స్ ఉపయోగపడతాయి.

